క్లుప్తంగా

కేజీబీవీలో వంట పనులకు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దేముల్: మండల పరిధి మారేపల్లి కస్తూర్బా గాంధీ గురుకుల(కేజీబీవీ) బాలికల పాఠశాలలో ఇద్దరు వంట సహాయకుల నియామకం చేపట్టనున్నామని, ఆసక్తి గలవారు ఈ నెల 15తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాధికారి వెంకటయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత.. 7వ తరగతి పాసై ఉండాలని, వయసు 18 నుంచి 45 సంవత్సరాల లోపు మహిళలు, స్థానికులై ఉండాలని పేర్కొన్నారు. దరఖాస్తులను మండల విద్యా వనరుల కేంద్రంలో ఇవ్వాలని సూచించారు.

ఆదర్శ పాఠశాలలో..

నవాబుపేట: నైట్ వాచ్‌మెన్ ఓ (మహిళ), వంట చేయడానికి మరో ఇద్దరు మహిళల నియామకానికి అర్హత కలిగిన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు మండల విద్యాధికారి గోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశా లలో కాపలాగా ఉండేందుకు మహిళ, పదో తరగతి ఉత్తీర్ణురాలై ఉండాలని, అదే విధంగా ప్రధాన వంట మనిషి పదో తరగతి, రెండో వంట మనిషి 7వ తరగతి పాసై ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు ఈ నెల 11 వరకు మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని వెల్లడించారు.

కాంగ్రెస్ గ్రామ కమిటీల ఎన్నిక



కమిటీ అధ్యక్షుడికి నియామకపత్రం అందజేస్తున్న నాయకులు

తాండూరు రూరల్: రానున్న పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు జెన్నె నాగప్ప పిలుపునిచ్చారు. గురువారం మండల పరిధి అంతారంతండా, బిజ్వార్ గ్రామాల్లో యూత్ కాంగ్రెస్ గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగదీష్, వర్కింగ్ ప్రెసిడెంట్ పురుషోత్తంరెడ్డి, నాయకులు సుధాకర్, రమేష్, సాయిలు ఉన్నారు.

మాజీ ప్రజాప్రతినిధులకు సన్మానం



పాలక సభ్యులను సన్మానిస్తున్న గ్రామస్తులు

కొడంగల్ రూరల్: పంచాయతీ మాజీ పాలక సభ్యులను గ్రామస్తులు గురువారం ఘనంగా సన్మానించారు. మాజీ సర్పంచ్ బాలమణి, ఉప సర్పంచ్ శ్రీనివాస్, వార్డు సభ్యులను శాలువా కప్పి, పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. ఐదేళ్ల పాలన కాలంలో గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని, వారి సేవలు మరువలేనివని కొనియాడారు. కార్యక్రమంలో గ్రామస్తులు జైపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సాయిలు, బసప్ప, శేఖర్, రుక్కప్ప, గంగమ్మ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం తగదు



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీపీ, అధికారులు

కుల్కచర్ల: మొక్కల పెంపకం పట్ల నిర్లక్ష్యం చేయరాదని ఎంపీపీ సత్యహరిశ్చంద్ర అన్నారు. గురువారం మండల పరిధి ఎర్రగోవింద్ తండాలో నర్సరీని పరిశీలించి మాట్లాడారు. మొక్కలు ఆరోగ్యంగా పెరిగే విధంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహించాల్సిన కార్యక్రమాలను వెంటనే పూర్తి చేయాలన్నారు. పారిశుద్ధ్య పనులను పక్కా ప్రణాళికతో చేయిస్తూ.. ముందుకు సాగాలని సూచించారు. గ్రామ ప్రత్యేకాధికారి డిప్యూటీ తహసీల్దార్ రమేష్, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ



ఎస్ఐ అరవింద్

మోమిన్‌పేట: మోమిన్‌పేట ఎస్ఐగా అరవింద్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఎస్ఐ విఠల్‌రెడ్డి కరన్‌కోటకు బదిలీపై వెళ్లారు. తొలుత అరవింద్ యాలాలలో విధులు నిర్వహించారు. అక్కడి నుంచి ఇటీవల తాండూరు టౌన్‌కు బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కానీ.. తాండూరులో ఆయన బాధ్యతలు చేపట్టకుండానే.. తిరిగి అరవింద్‌ను మోమిన్‌పేటకు పంపించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడారు. శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని చెప్పారు.

ఉద్యానసాగుకు ఆదరణ కరువు

- సబ్సిడీకి సర్కారు మంగళం
- ఆందోళనలో కూరగాయ రైతులు
- పందిరి సాగుకు సతమతం
- రాయితీతో కూడిన విత్తనాలు, సేద్య పరికరాలు ఇవ్వాలంటున్న అన్నదాతలు



పందిరి విధానంలో కాకర సాగు

మోమిన్‌పేట: ఉద్యాన పంటలకు ప్రభుత్వ ఆదరణ కరువైంది. కూరగాయ విత్తనాలు, మల్చింగ్, పందిరి ఏర్పాటుకు అందిస్తున్న రాయితీలకు గత ప్రభుత్వం మంగళం పడగా.. కాంగ్రెస్ సర్కార్ అయినా ఆదుకుంటుందేమోనని రైతులు ఎదురు చూస్తున్నారు. సబ్సిడీ కోసం దరఖాస్తు చేసుకుని మూడేళ్లుగా ఎదురు చూస్తున్నప్పటికీ.. ప్రభుత్వం స్పందించకపోవడంతో.. కూరగాయల సాగుపై ఆసక్తి చూపలేకపోతున్నామని, అవసరమైన పరికరాలను అందిస్తే చాలని రైతులు కోరుతున్నారు. లేదంటే మార్కెట్ ధరకు సాగు పరికరాలు, విత్తనాలు విక్రయించి సేద్యం చేస్తే లబ్ధి చేకూరడం లేదని వాపోతున్నారు. తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేయాలంటే బిందు, తుంపర సేద్య పరికరాలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని నాడు అధికారులు పేర్కొనడంతో 90శాతం సబ్సిడీపై ప్రభుత్వం అందించేది. ఎకరాకు రూ.10వేల నుంచి రూ.15వేలతో డ్రిప్ పరికరాలు వచ్చేవి. సబ్సిడీ లేక పోవడంతో రూ.90 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తుందని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

హైబ్రిడ్ విత్తనాలు చాలా ఖరీదు

మండలంలో 321 మంది చిన్న, సన్నకారు రైతులు డ్రిప్ పరికరాల కొరకు మీ సేవలో దరఖాస్తు చేసుకొని ఏళ్లు గడుస్తోంది. అయినా పురోగతి లేదు. 60మంది రైతులు వివిధ కూరగాయ పంటల సాగుకు మల్చింగ్ పేపర్‌ను పూర్తిస్థాయి డబ్బును వెచ్చించి కొనుగోలు చేసి, సాగు చేశారు. గతంలో ప్రభుత్వం ఎకరాకు రూ.6,400లను సబ్సిడీ కింద రైతు ఖాతాలో జమచేసేది. ఈ సారి అదీ లేక ఎదురు చూస్తున్నారు. తీగ జాతీ కూరగాయల సాగు పందిరి ఏర్పాటుకు ప్రభుత్వం 50శాతం సబ్సిడీ ఇచ్చేది. మూడేళ్లుగా రూపాయి ఇవ్వటం లేదు. హైబ్రిడ్ రకం విత్తనాలకు మార్కెట్‌లో చాలా ఖరీదు చేస్తున్నాయి. అప్పట్లో రాయితీ ఇవ్వడం వలన.. రైతులకు కొంత ఊరట లభించేది.

మల్చింగ్ రాయితీ రాలేదు..



రెండు ఎకరాల్లో టమాట సాగుకు మల్చింగ్ వేశాను. రూ.18వేల వరకు ఖర్చు అయింది. గతంలో ఎకరాకు రూ.6,400లను సబ్సిడీ కింద ప్రభుత్వం ఇచ్చేది. ఇప్పుడవేం లేవు. కాంగ్రెస్ సర్కార్ కరుణించి.. కూరగాయ సాగుకు విత్తనాలు, మల్చింగ్, పందిరి, బిందు, తుంపర సేద్య పరికరాలకు రాయితీ ఇవ్వాలి.

– రాంచంద్రారెడ్డి, రైతు, ఎన్కేపల్లి

పామాయిల్ తోటలకే సబ్సిడీ



పామాయిల్ తోటలకే సబ్సిడీలు ఉన్నాయి. బిందు సేద్య పరికరాలు కేవలం పామాయిల్ సాగు చేసే రైతులకు మాత్రమే ఇస్తున్నాం. ఉద్యాన పంటల సాగుకు ప్రస్తుతం ఎలాంటి రాయితీ లేదు. ప్రభుత్వం నిధులు కేటాయిస్తే కూరగాయ పంటలకు వస్తుంది.

– గఫూర్, ఉద్యానశాఖ అధికారి

సమన్వయంతోనే గ్రామాభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ మురళీధర్

కుల్కచర్ల: సమన్వయంతో పనిచేస్తేనే గ్రామాభివృద్ధి చెందుతుందని, ఆ దిశగా అందరూ ముందుకు సాగాలని తహసీల్దార్ మురళీధర్ సూచించారు. గురువారం జీపీ కార్యాలయంలో పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడారు. ప్రజారోగ్యమే లక్ష్యంగా, గ్రామాభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలని సూచించారు. అందులో భాగంగా తొలుత పారిశుద్ధ్య కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రతిరోజు ఒక్కో శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంటుందని, అధికారులు తమ శాఖా పరమైన కారక్రమాలను చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఆనందం, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, స్థానిక నాయకులు వెంకటేశ్, మోత్కూరు వెంకటేశ్, రాములు, విజయ్, అంజి, అంగన్‌వాడీలు పద్మమ్మ, అనసూయ, లత, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ధ్యానం.. ఆరోగ్యానికి సోపానం



ధ్యానం గురించి అవగాహన కల్పిస్తున్న పిరమిడ్ సభ్యులు

పరిగి: అరగంట ధ్యానం.. ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని, అనేక రోగాలు దూరమవుతాయని పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ధ్యాన ప్రచార కార్యదర్శి ఆంజనేయరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధి సయ్యద్‌మల్కాపూర్, కాళ్లపూర్, జాఫర్‌పల్లి గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజలకు ధ్యానంపై అవగాహన కల్పించారు. అనంతరం మాట్లాడారు. శ్వాసమీద ధ్యాస అనే ధ్యానం వలన తలనొప్పి, క్యాన్సర్ లాంటి రోగాలు నయమవుతాయన్నారు. నిత్య ధ్యానంతో ఒత్తిడి దూరమవుతుందని, ఆత్మశక్తి పెరుగుతుందని వెల్లడించారు. ధ్యానం.. మనిషి ఆరోగ్యంగా, ఆనందంగా, ఉత్సాహంగా జీవించడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. కావున అందరూ ప్రతి రోజు ఉదయం ధ్యానం చేయడం నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పిరమిడ్ సంస్థ సభ్యులు బాలకృష్ణారెడ్డి, శైలజ, బాబు, వేణు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో కమలనాథుల పర్యటన

కేంద్ర ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి వివేకానందరెడ్డి తదితరులు

ధారూరు: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని క్షేత్రస్థాయిలో ప్రజల్లో తీసుకెళ్లడమే లక్ష్యంగా బీజేపీ చేపట్టిన 'చలోగావ్' కార్యక్రమంలో భాగంగా ఆ పార్టీ శ్రేణులు పల్లెల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. గురువారం మండల పరిధి నాగారం, గురుదోట్ల గ్రామాల్లో బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి వివేకానందరెడ్డి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాండుగౌడ్ ఆధ్వర్యంలో పర్యటించారు. రైతులు, ఉపాధ్యాయులు, ఉపాధిహామీ కూలీలు, ప్రజలతో మాట్లాడారు. సమస్యల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కేంద్రం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. సంక్షేమ ఫలాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పేదలకు ఉచిత రేషన్ బియ్యం, గ్యాస్ కనెక్షన్, ఏడాదికి రూ.6 వేల పీఎం కిసాన్ పథకం, ఉపాధిహామీతో కూలీలకు చేకూరే ప్రయోజనం, ఉపాధి నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులపై బీజేపీ నాయకులు ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు వైద్యనాథ్, రాజేందర్‌గౌడ్, ఎం.రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతుల్లేకుండా నిర్మాణాలు!

చోద్యం చూస్తున్న అధికారులు

- రూ. లక్షల్లో ప్రభుత్వ ఆదాయానికి గండి
- నోటీసులు ఇచ్చినా బేఖాతరు
- పట్టించుకోని ఉన్నతాధికారులు



కొనసాగుతున్న అక్రమ నిర్మాణ పనులు

నందిగామ: ఏదైనా చిన్నపాటి ఇళ్లు నిర్మించుకుంటేనే.. సంబంధిత అధికారులు అనేక రకాల ప్రశ్నలు వేస్తారు. కాగితాలపై ఆరా తీస్తారు. వారు అడిగిన వాటిల్లో ఏ ఒక్క పేపరు అందుబాటులో లేకపోయినా నిర్మాణపు పనులు నిలిపివేస్తారు. అలాంటిది.. రంగారెడ్డి జిల్లా నందిగామ మండల కేంద్రమైన నందిగామలో ఎలాంటి పర్మిషన్లు లేకుండా యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నా.. పట్టించుకునే వారే కరువయ్యారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి రూ.లక్షల్లో గండి పడుతోంది. నందిగామ పరిధిలోని పాత జాతీయ రహదారి చంద్రాయాన్ గూడ నుంచి మామిడిపల్లి వెళ్లే రహదారికి ఆనుకొని ఉన్న సర్వే నంబరు 1435లో గతంలో అక్కడ ఒక చిన్న పరిశ్రమ ఉండేది. దాని వెనకాలే ఇటీవల అతిపెద్ద కంపెనీ నిర్మాణ పనులు జోరుగా కొనసాగిస్తున్నారు. ఈ పరిశ్రమ నిర్మాణానికి సంబంధించి ఎలాంటి అనుమతులు లేకుండా రాత్రి పగలు తేడా లేకుండా నిర్మాణ పనులు జోరుగా జరుగుతున్నాయి. ఈ విషయంలో ఏ ఒక్క అధికారి కూడా అటు వైపు కన్నెత్తి చూడటం లేదు. గ్రామంలో ఏ ఒక్క చిన్న నిర్మాణ పనులు జరిగినా.. హుటాహుటిన సంబంధిత అనుమతి పత్రాలను అడిగి తీసుకుంటారు. అనుమతులు లేనట్లయితే పనులను నిలిపివేయించే అధికారులు.. ఇక్కడ జరుగుతున్న అక్రమ నిర్మాణంలో ఏమాత్రం తమకు తెలియదన్నట్లు వ్యవహరించడం చర్చనీయాంశంగా మారింది.

చర్యలు తీసుకుంటాం

మామిడిపల్లి రోడ్డులో అనుమతులు లేకుండా పరిశ్రమ నిర్మిస్తున్నారన్న విషయం వాస్తవమే. మాకు ఇటీవలే తెలిసింది. అనంతరం గతనెల 31న నోటీసులు జారీచేశాం. నిర్మాణ పనులు నిలిపివేయించాం. 10 రోజుల్లో వివరణ రానట్లయితే.. మరో నోటీసు జారీ చేస్తాం. తర్వాత చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– మల్లికార్జున రెడ్డి, గ్రామ కార్యదర్శి, నందిగామ

నోటీసులను పట్టించుకోని వైనం



గ్రామ కార్యదర్శి జారీ చేసిన నోటీస్

ప్రభుత్వ ఆస్తులను సంరక్షించడంతో పాటు ప్రభుత్వానికి రావాల్సిన పన్నులను వసూలు చేయాల్సిన అధికారులు.. ఇక్కడ నిరంతరాయంగా అక్రమ నిర్మాణ పనులు జరుగుతున్నా.. వారు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. అక్రమ నిర్మాణానికి సంబంధించి గ్రామ పంచాయతీ అధికారులు.. గత నెల 31న యజమానికి నోటీసులు ఇచ్చిందని, అయినా.. సదరు యాజమాన్యం యథేచ్ఛగా నిర్మాణ పనులు కొనసాగిస్తుండటం తో అధికారుల తీరుపై మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి, నిర్మాణ పనులను నిలిపివేసి, సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

గ్రామస్తుల సహకారం మరువలేం

- మాజీ సర్పంచ్, పీసీసీ ఉపాధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి
- పలుగుట్టలో పాలకవర్గానికి ఘనంగా వీడ్కోలు



సన్మానించిన గ్రామస్తులు, నాయకులు

చేవెళ్ల: గ్రామాభివృద్ధిలో గ్రామస్తుల సహకారం మరువలేమని పలుగుట్ట మాజీ సర్పంచ్, పీసీసీ ఉపాధ్యక్షుడు ఎం. జనార్దన్‌రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలంలోని పలుగుట్ట గ్రామంలో గురువారం గ్రామస్తులు.. పంచాయతీ పాలకవర్గం సభ్యుల పదవీ కాలం ముగియడంతో వారికి ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రత్యేకాధికారి శిరీష, పీసీసీ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, ముడిమ్యాల పీఏసీఎస్ చైర్మన్ గోనేప్రతాప్‌రెడ్డి, కాంగ్రెస్ మండల కార్యదర్శి రాంరెడ్డి, నర్సింలు తదితరుల ఆధ్వర్యంలో సన్మానం, వీడ్కోలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ ఐదేళ్ల పదవీకాలంలో తనకు సహకరించి తనను ముందుకు నడిపించిన గ్రామ ప్రజలకు ఎప్పుడు రుణపడి ఉంటానని చెప్పారు. గ్రామంలో తన వంతుగా చేయాల్సిన అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంవలో నర్సింహ్మారెడ్డి, బుచ్చిరెడ్డి, క్రిష్టారెడ్డి, కార్యదర్శి నరేశ్‌గౌడ్, మండల కార్యదర్శి నర్సింహ్మారెడ్డి, చల్మారెడ్డి, గ్రామస్తులు ఎం. మనోహర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, బాల్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, సుబ్రహ్మణ్యస్వామి, వెంకట్‌రెడ్డి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐలకు ఘన సన్మానం



తాండూరు రూరల్: ఎస్ఐని సన్మానిస్తున్న నాయకులు

ధారూరు: బదిలీ అయిన ఎస్ఐ సంతోష్‌కుమార్‌ను గురువారం కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు శాలువాలు కప్పి, పూల మాలలు వేసి ఘనంగా వీడ్కోలు పలికారు. అదే విధంగా కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ వేణుగోపాల్‌గౌడ్‌కు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇరువురిని సన్మానించారు. కార్యక్రమంలో రాంపూర్‌తండా మాజీ సర్పంచ్ పాండునాయక్, కాంగ్రెస్ నాయకులు మహ్మద్ బాబాఖాన్, బుజ్జయ్యగౌడ్, ఎల్. అశోక్, ప్రభాకర్‌రెడ్డి, నెల్లి అశోక్ పాల్గొన్నారు.

విఠల్‌రెడ్డికి..

తాండూరు రూరల్: కరన్‌కోట్ ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన విఠల్‌రెడ్డిని మల్కాపూర్, జినుగుర్తి గ్రామాల నాయకులు గురువారం సన్మానించారు. సన్మాన కార్యక్రమంలో పండరి, రాములు, శివప్ప, బందెప్ప, మైనొద్దీన్, అబ్దుల్ మజీద్, పండరిచారీలు ఉన్నారు.

ఉచిత విద్యుత్‌కు ఇంటింటి సర్వే



సిబ్బంది పని తీరును పరిశీలిస్తున్న ఎస్ఈ వెంకన్న, డీఈఈ శివశంకర్


చేవెళ్ల: గృహజ్యోతి పథకంలో భాగంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌కు సంబంధించి అధికారులు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. అర్హులైన అందరికీ ఈ పథకం వర్తింపచేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని విద్యుత్‌శాఖ ఎస్ఈ వెంకన్న పేర్కొన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో సర్వే నిర్వహిస్తున్న విద్యుత్ సిబ్బంది పనితీరును ఎస్ఈ వెంకన్న, డీఈఈ శివశంకర్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు నేరుగా లబ్ధిదారుల ఇంటికి వెళ్లి, వివరాలు ఎలా సేకరిస్తున్నారు? సంబంధిత విషయాలను ఎలా నమోదు చేస్తున్నారనే వాటిని పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో భాగంగా ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేయనున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ నెల 15వ తేదీ వరకు ఈ సర్వే వివరాలను ప్రభుత్వానికి అందించాల్సి ఉందని అప్పటిలోగా సిబ్బంది వివరాల సేకరణ పూర్తి చేయాలని సూచించారు. విద్యుత్ వినియోగదారుల ఇంటికొచ్చే తమ సిబ్బందికి ప్రజా పాలన దరఖాస్తు చేసుకున్న నెంబర్‌తోపాటు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, ఫోన్ నెంబర్లను అందజేయాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఏడీ స్వామి, ఏఈ జానీ మోహినుద్దీన్, లైన్‌మెన్ పులయ్య ఉన్నారు.

తాండూరు సెగ్మెంట్‌లో 2,43,849 మంది ఓటర్లు

తుది ఓటరు జాబితా విడుదల

తాండూరు: నియోజకవర్గ పరిధి ఓటరు జాబితా విడుదలయింది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో నెల రోజుల పాటు కొత్త ఓటర్ల కోసం దరఖాస్తులు స్వీకరించిన విషయం తెలిసిందే. ఇందులో తాండూరు అసెంబ్లీ పరిధి నుంచి కొత్తగా 7,773 మంది ఓటర్లు చేరగా.. ఈ మేరకు గురువారం ఆర్డీఓ శ్రీనివాసరావు తుది జాబితాను విడుదల చేశారు. అసెంబ్లీ పరిధిలో మొత్తం 2,43,849 మంది ఓటర్లు ఉండగా.. అందులో పురుషులు 1,18,228 మంది, మహిళలు 1,25,614 మంది, ఇతరులు 7 మంది ఉన్నట్లు అధికారులు ధృవీకరించారు. అయితే గతేడాది నవంబర్ నెలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సెగ్మెంట్‌లో 2,36,076 మంది (పురుషులు 1,15,143, మహిళలు 1,20,927) ఓటరు జాబితాతో ఎన్నికలు నిర్వహించారు. లోక్‌సభ ఎన్నికల కోసం అధికారులు ఇటీవల కొత్త ఓటర్ల కోసం అర్జీలు స్వీకరించగా.. కొత్తగా 7,773 మంది ఓటర్లు చేరారు. ఓటరు జాబితాపై శుక్రవారం తాండూరు ఆర్డీఓ కార్యాలయంలో పలు రాజకీయ పార్టీలకు చెందిన నాయకులతో సమీక్ష నిర్వహించనున్నట్లు ఆర్డీఓ తెలిపారు.

దొంగలున్నారు.. జాగ్రత్త



ప్రయాణికులతో మాట్లాడుతున్న పోలీసులు

కొడంగల్: ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించినప్పటి నుంచి దొంగతనాలు పెరిగాయని, ప్రయాణికులు జాగ్రత్తగా ఉండాలని పోలీసులు చెప్పారు. గురువారం కొడంగల్ బస్టాండ్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పోలీసులు మాట్లాడారు. బస్సుల్లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండటం వలన.. దొంగల చేతివాటం పెరిగిందని తెలిపారు. అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండటంతో పాటు, ఆభరణాలు, సామగ్రిని భద్రంగా ఉంచుకోవాలని ప్రయాణికులకు సూచించారు.

అల్పాహార దాతకు సత్కారం



నజీర్ అహ్మద్‌ను సన్మానిస్తున్న వైస్ చైర్‌పర్సన్ దీప

తాండూరు టౌన్: ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి ఆవరణలో రోగులకు, వారి బంధువులకు నిత్యం ఉచితంగా అల్పాహారం అందజేస్తున్న ఎస్ఓఎఫ్ అంబులెన్స్ డ్రైవర్ నజీర్ అహ్మద్‌ను మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దీప గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. నజీర్.. తన సంపాదనలో కొంత భాగాన్ని వెచ్చించడమే కాకుండా.. పలువురు దాతల సహకారంతో చాలా కాలంగా అల్పాహారం పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. నజీర్‌ను.. ఆదర్శంగా తీసుకొని, ఆయన మార్గంలో నడవాల్సిన అవసరం ఎంతైనా ఉందని సూచించారు. సన్మాన కార్యక్రమంలో కౌన్సిలర్ ముక్తార్ నాజ్, ప్రముఖులు కమాల్ అతర్, మురళీ, రాజన్‌గౌడ్, రవి తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న కడా అధికారి వెంకట్‌రెడ్డి

బొంరాస్‌పేట: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ డబ్బులను సద్వినియోగం చేసుకోవాలని కడా అధికారి వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధి బురాన్‌పూర్, రేగడిమైలారం, మహంతీపూర్, చౌదర్‌పల్లి, నాందార్‌పూర్, లింగన్‌పల్లి, కొత్తూరు తదితర గ్రామాలకు చెందిన 59మంది లబ్ధిదారులకు ఆయన చెక్కులు పంపిణీ చేశారు. ఇందులో ఎంపీపీ హేమీబాయి, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, నాయకులు నర్సింహులు గౌడ్, రాజేశ్‌రెడ్డి, అంజిల్‌రెడ్డి, నర్సింహులు నాయుడు, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

కొడంగల్ రూరల్: పట్టణంలోని శ్రీమహాదేవుని దేవాలయంలో గురువారం మాస శివరాత్రిని పురస్కరించుకొని ఆలయ భజన మండలి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 9గంటల నుంచి 12.30గంటల వరకు లింగాష్టక పారాయణం, అనంతరం శివలింగానికి పంచామృతాభిషేకం, అష్టోత్తర శతనామావళి, విశేష అలంకరణ, ధూపదీప నైవేద్యాలను సమర్పించారు. అనంతరం మంగళహారతులు అందించారు.

కేంద్ర సంక్షేమ పథకాలపై అవగాహన

చేవెళ్ల: కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రజలకు సక్రమంగా అందుతున్నాయా? లేదా అనే విషయాలపై అవగాహన కల్పించడమే 'గావ్‌చలో గర్‌చలో' కార్యక్రమం జరుగుతుందని బీజేపీ నాయకులు అన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం కందవాడ, దేవరంపల్లి, ఈర్లపల్లిలో ఆ పార్టీ నాయకులు పర్యటించారు. ఇంటింటికి వెళ్లి.. స్థానికులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. గ్రామాల్లో ప్రజా సమస్యలను వారు అడిగి తెలుసుకున్నారు. పార్టీ నాయకులు అంతా వారికి కేటాయించిన గ్రామాల్లో తిరుగుతూ వారితో కలిసి ఉంటూ.. అక్కడే బస చేస్తున్నట్లు తెలిపారు. ఇది పార్టీ పటిష్టతకు ఎంతో మేలు చేస్తోందన్నారు. దేవరంపల్లిలో బీజేపీ యువమోర్చా ప్రధాన కార్యదర్శి మధుకర్‌రెడ్డి, ప్రకాశ్, ఆనంద్‌గౌడ్, ఈర్లపల్లిలో నితీష్‌రెడ్డి, మణికంట, శ్రీనాథ్, కందవాడలో సీనియర్ నాయకులు ఆంజనేయులుగౌడ్, దేవుని శర్వలింగం ఉన్నారు.